క్లుప్తంగా

పేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నాడు. మండల పరిధిలోని చంద్రధనకు చెందిన రాములమ్మ, అమృతమ్మ ఇటీవల నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టారు. డబ్బులు లేక మధ్యలో నే ఇంటి నిర్మాణాలు నిలిపివేశారు. స్థానిక నాయకుడు, ఉప సర్పంచ్ సుధాకర్ సహకారంతో జెడ్పీటీసీని కలిసి ఆర్థికసహాయం అందజేయాలనికోరారు. స్పందించిన జెడ్పీటీసీ ట్రస్టు సభ్యులచే వీరి ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, రాజేందర్‌రెడ్డి, సన్నీ, గిరి పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

హయత్‌నగర్: తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరులో అర్ధాంతరంగా నిలిచిపోయిన వెంకటేశ్వర స్వామి దేవాలయ పునఃనిర్మాణ పనులను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి,ససంగీతా మోహన్‌గుప్త, కోఆప్షన్ సభ్యుడు సువర్ణ, నాయకులు అంజయ్య, లక్ష్మీదాస్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

'వెంకటాపూర్ అభివృద్ధికి కృషి'

తలకొండపల్లి: అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్‌ట్యాంక్‌లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి వెంకటాపూర్ అభివృద్ధికి కృషిచేస్తానని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ ముందుకు వెళ్తుందన్నారు.బుధవారంమండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆయన పర్యటించారు.గ్రామంలోని ఎల్లమ్మ, హనుమాన్,పీర్ల కొట్టం తదితర వాటిఅభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఫౌండేషన్ నిధుల చే స్వయం ఉపాధి పథకాలు చేపట్టి ముదిరాజ్ కుల సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

యాచారం: మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒక పాడి గేదె మృతి చెందింది.గ్రామానికి చెందిన మారెడుపల్లి లాల్‌రెడ్డికి చెందిన (దాదాపు రూ.లక్షన్నర విలువ జేసే) పాడి గేదె బుధవారం మధ్యాహ్నం వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా విద్యుత్ వైరుకు తగిలింది.దీంతో విద్యుదాఘాతానికి గురైై గేదె అక్కడికక్కడే మృతిచెందింది.పాల ఉత్పత్తిపైనే ఆధారపడి జీవించే తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

మంచాల:మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మి షన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అదే వి . ధంగా తరగతులు కూడా నిర్వహిస్తామని పే ర్కొన్నారు. ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్స రం ఫలితాల్లో రంగారెడ్డి జిల్లాలోనే మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించిందన్నారు.మండలంలోనివిద్యార్థులు మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని తెలిపారు. ఉన్నత ప్రామాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యా ర్థుల తల్లిదండ్రులు కూడా ఆలోచించి మంచాల ప్రభుత్వ జూనియ ర్ కళాశాలకు మీ పిల్లలను పంపించాలని సూచించారు.

నేడు ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

ఆమనగల్లు:ఆమనగల్లు మండల పరిషత్ కార్యాల య సమావేశపు హాలులో గురువారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెంటయ్య

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా మన్సూరాబాద్‌కు చెందిన సీహెచ్ పెంటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బర్రె రాజ్‌కుమార్ జారీ చేసిన నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. మన్సూరాబాద్ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు

ఆటలు సరే.. స్థలాలు ఏవి?



జాపాలలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం

- క్రీడా మైదానాల ఏర్పాటులో తీవ్ర జాప్యం
- మంచాలలో 23 గ్రామాలకు గాను 12 గ్రామాల్లో మాత్రమే ఏర్పాటు
- ఏర్పాటు చేసిన మైదానాల్లోనూ వసతులు కరువు
- త్వరగా గుర్తించాలంటున్న క్రీడాకారులు

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున సీఎం కప్ పేరుతో క్రీడోత్సవాలను నిర్వహిస్తుంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం గ్రామాల్లో కనీసం ఆటస్థలాలు లేని పరిస్థితి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామీణ స్థాయిలో క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా మండల స్థాయిలో సీఎం కప్ క్రీడల పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నారు. అక్కడ కూడా ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేయడం జరుగుతుంది. ఇలా ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీలు క్రీడాకారులకు నూతన ఉత్తేజాన్ని ఇస్తున్నాయి.

మౌలిక సదుపాయాలు కరువు..

ప్రతీ గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో క్రీడలకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తామంది. అయితే మంచాల మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు గాను ఇప్పటివరకు కేవలం 12 గ్రామాల్లో మాత్రమే క్రీడామైదానాలను గుర్తించారు. అస్మత్‌పూర్, కాగజ్‌ఘాట్ గ్రామాల్లో ఆటస్థలానికి సబంధించిన భూ సమస్య కొనసాగుతుంది. మరో 9 గ్రామాల్లో ఇంకా క్రీడా మైదానాలను అసలు ఇప్పటివరకు గుర్తించలేదు. గుర్తించిన 12 గ్రామాల్లో కూడా క్రీడా మైదానం వద్ద ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఆటల పోటీలు నిర్వహించే రోజుల్లో మాత్రమే ప్రభుత్వం తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించి చేతులు దులుపుకుంటోంది. అధికారులు తక్షణమే మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడాస్థలాలు గుర్తించడంతో పాటు అక్కడ మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడా మైదానాలు గుర్తించాలి



గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. అయితే అన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రాక్టీస్ కోసం మండల కేంద్రాలకు,పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది.ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరగా అన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలను గుర్తించాలి. అందులో మౌలిక వసతులు కల్పించాలి.

– సాతిరి శ్రీనివాస్, ఆరుట్ల

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం



త్వరలో అన్ని గ్రామాల్లో క్రీడా మైదానాలను గుర్తించి గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తాం. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద ఆట స్థలాలు ఏర్పాటు నిధులు ఇవ్వడం జరుగుతుంది.అక్కడ తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఏర్పాటు చేయని చోట క్రీడామైదానాల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

– తేజ్‌సింగ్, ఎంపీఓ, మంచాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఉత్సవాలు అంబరాన్నంటాలి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు అంబరాన్నంటాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శేరిగూడలో నియోజకవర్గ స్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వరాష్ట్రం సాధించుకున్న అనంతరం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటాచారి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, జెడ్పీటీసీ జంగమ్మ, ఏసీపీలు ఉమామహేశ్వర్‌రావు, పురుషోత్తంరెడ్డి, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్ శాఖ ఎస్సీ, డీఈలతోపాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

కడ్తాల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మురళీకృష్ణ,ఎంపీడీఓ రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీఓ మధుసూదనాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి 22 వరకు ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తోందని ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వేడుకలు అంబరాన్నాంటాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణ, నిరంజన్‌గౌడ్, ఖలీల్, సాయిలు, మల్లేశ్, అల్లాజీ, వెంకటేశ్, బాలస్వామి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మహార్యాలీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న లింగ బలిజ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో జూన్ 4న హైదరాబాద్‌లో నిర్వహించే లింగాయత్‌ల మహార్యాలీ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఇబ్రహీంపట్నంలోని శ్రీభవానీ నాగలింగేశ్వర ఆలయంలో ఆవిష్కరించారు. ర్యాలీలో పెద్దసంఖ్య లో లింగాయత్ కులస్తులు పాల్గొనాలని ఆసంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆ సంఘం నేతలు శెట్టి శివకుమార్, కర్నె అరవింద్, మల్లప్ప, నాగేశప్ప, కుమారప్ప, విజయప్ప, మల్లికార్జున్, మహేశ్ పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

మంచాల: ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే లింగాయత్ మహా ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. బుధవారం మంచాలలో లింగాయత్ మహార్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భిక్షపతి, అధ్యక్షుడు శేఖరప్ప, ప్రధాన కార్యదర్శి హరీశ్, నాయకులు జ్ఞానేశ్వర్, సోమప్ప, ఆనందప్ప, కోటప్ప, చంద్రకాంత్, విజయప్ప, ప్రభు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల బాధితులకు పరిహారం అందించండి

- అదనపు కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి

యాచారం: మంతన్‌గౌరెల్లి గ్రామంలో రెండు నెలల కింద వడగళ్లు కురిసి రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వెంటనే వారికి పరిహారం అందజేసి ఆదుకోవాలని బుధవారం సీపీఎం బృందం.. జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కలిసి మంతన్‌గౌరెల్లి, కేసీతండా, భానుతండా గ్రామాల్లో 600కు పైగా రేకుల ఇళ్లు, 100 ఎకరాలకు పైగా వరి, కూరగాయలు, పండ్లతోటలకు తీవ్ర నష్టం జరిగిందని, దాదాపు రూ.3 కోట్లకు పైగా రైతులు, ప్రజలు నష్టపోయారని తెలియజేశారు. అధికారులు వచ్చి పంటనష్టంపై నివేదకను కూడా ఉన్నతాధికారులకు అందజేశారని అయినప్పటికీ ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. అలాగే వడగళ్లకు రేకుల ఇళ్లు పూర్తిగా రంధ్రాలు పడి పేదలు ఇబ్బందులు పడుతున్నారని వారి ఇళ్ల నిర్మాణాలకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ వర్గ సభ్యులు బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, మండల కమిటీ సభ్యులు తావునాయక్, చందునాయక్, నాయకులు మల్లేశ్, గడ్డం కుమార్, నర్సింహ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతువేదికలో మాట్లాడుతున్న బలదేవ్‌రెడ్డి

- రైతుబంధు కోఆర్డినేటర్ బలదేవ్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రైతుబంధు కోఆర్డినేటర్ కందాళ బలదేవ్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బుధవారం గ్రామ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి, మండల వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మన్, గ్రామ రైతు బంధు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రోహిణి కార్తె విత్తనాలు



జొన్న విత్తనాలేస్తున్న రైతులు

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం మోస్తారు వర్షం కురిసింది. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు మంగళవారం కురిసిన వర్షాలకు మెట్ట పంటల సాగుపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా రోహిణి కార్తెలో విత్తనాలేస్తే పంట బాగా వచ్చి మంచి దిగుబడి వస్తుందని రైతులకు ఎంతో నమ్మకం. దీనిని దృష్టిలో ఉంచుకొని బుధవారం తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఆరుతడి పదును భూమిలోనే జొన్న లేశారు. పచ్చ జొన్నల విత్తనాలేస్తే రోహిణి కార్తెలో మంచి దిగుబడి వస్తుందని రైతులకు ఎంతో నమ్మకం.

3న కల్యాణోత్సవం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని శ్రీ భవానీ నాగలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని జూన్ 3న నిర్వహిస్తున్నట్లు వీరశైవ సమాజం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తానమ్నారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరుకాగలరని కోరారు.

దైవచింతన కలిగి ఉండాలి

- సీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. గురువారం పురపాలక సంఘం పరిధి ఆపిల్ సిటీ వెంచర్‌లో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు కొత్తకుర్మ శివకుమార్, కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రవిగౌడ్ పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గౌడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి

లింగోజిగూడ: గౌడ సామాజికవర్గ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సరూర్‌నగర్‌లోని గౌడ సంఘం భవనంలో పల్లె రవికి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గౌడ్లు ఆర్థికంగా బలపడేందుకు మద్యం దుకాణాలలో 15 శాతం రిజర్వేషన్ కలిపించడంతో పాటు గీత బీమాను ప్రకటించిందని తెలిపారు. త్వరలో మరిన్ని పథకాలను గౌడ్ల కోసం ప్రభుత్వం అమలు చేయనున్నదని తెలిపారు. గౌడ్లకు సేవా చేసుకునే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని, పార్టీలకు అతీతంగా గౌడ్ల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాయానంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్, సభ్యులు ప్రవీణ్‌కుమార్, బాలరాజు, వెంకటేశం గౌడ్, సత్తయ్య, ముద్దగౌని సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె రవిని సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

శ్రీకాంత్‌సింగ్‌కు సన్మానం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీకాంత్‌సింగ్‌ను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్రీకాంత్‌సింగ్‌ను జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కల్వకుర్తి బీజేపీ కోకన్వీనర్ నర్సింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు రాంరెడ్డి, నాయకులు పరమేశ్‌గౌడ్, ప్రశాంత్, చెన్నకేశవులు, నర్సింహా తదితరులు సత్కరించారు.



శ్రీకాంత్‌సింగ్‌ను సత్కరిస్తున్న నాయకులు

'ఏపీజీవీబీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- రీజనల్ మేనేజర్ భీంసేన్‌రావు

కడ్తాల్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ముందజలో ఉందని బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ భీంసేన్‌రావు అన్నారు. ఆర్థిక అక్షరాస్యత సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత కొన్నినెలల క్రితం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మక్తమాధారం గ్రామానికి చెందిన పచ్చిపాల సురేశ్‌కు జనరల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ కావడం జరిగింది. మృతుడు బ్యాంకు ఖాతాదారుడు కావడంతో జనరల్ ఇన్సూరెన్స్ కింద రూ.4 లక్షలు క్లెయిమ్ కావడం జరిగింది. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుడి భార్య పి.సంధ్య(నామిని)కి సంబంధిత చెక్కును భీంసేన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా భీంసేన్‌రావు మాట్లాడుతూ.. ఖాతాదారులు బ్యాంకు అందించే సేవలను వినియోగించుకోవాలని.. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, వ్యక్తిగత ప్రమాద బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా కుటుంబానికి భద్రత కల్పించుకోవచ్చని సూచించారు. అదేవిధంగా రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు వృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. అనంతరం బ్యాంకు ద్వారా అందుతున్న వివిధ సేవలను ఖాతాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రమేశ్, ఎస్‌బీఐ బీడీఎం నరేశ్, బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్, ఫీల్డ్ అధికారి నజ్రీన్, అకౌంటెంట్ ఆంజనేయులు, క్యాషియర్ అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

మహిళ మెడలోని గొలుసు చోరీ

- హయత్‌నగర్ పీఎస్ పరిధిలో చోరీ

హయత్‌నగర్: ద్విచక్ర వాహనపై వచ్చిన ఓ యువకుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని సుమారు 2.5 తులాల బంగారు గొలుసు(పుస్తెల తాడు)ను లాక్కెళ్లిన ఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని నంది హిల్స్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ జాకెట్లు కుట్టించుకునేందుకు ప్రగతినగర్‌కు వచ్చి తన పాపతో కలిసి నడుచుకుంటూ తిరిగి వెళ్తోంది. వెనుక నుంచి ఫ్యాషన్ బైకుపై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకెళ్లాడు. బాధితురాలు కేకలు వేయడంతో కొంత మంది స్థానికులు బైకును పట్టుకునేందుకు యత్నించగా దొంగ తప్పించుకొని పారిపోయాడు. ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2 నుంచి కేరళలో ఐఏఎల్ జాతీయ మహాసభలు

- ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

నాగోలు: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) 11వ జాతీయ మహాసభలు జూన్ 2, 3, 4 తేదీల్లో కేరళ రాజధాని తిరువనంతపురంలో జరుగుతాయని ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. లాయర్స్ ఫర్ డెమోక్రసీ (ప్రజాస్వామ్యం కోసం న్యాయవాదులు) ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయవ్యవస్థ పరిరక్షణ అనే అంశాలపై ఈ సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. బుధవారం ఎల్‌బీ నగర్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో ఐఏఎల్ జాతీయ మహాసభల ప్రాధాన్యతను ఆయన వివరించారు. తిరువనంతపురంలో జరిగే ఐఏఎల్ జాతీయ మహాసభలను కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ప్రారంభిస్తారని ప్రభాకర్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభల్లో పలు అంశాలపై సెమినార్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహాసభలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది ప్రతినిధులె హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు ఏవీ కృష్ణారావు, కేవీఎల్‌డీ జయ శ్రీనివాస్, బొమ్మగాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీఓ జయరామయ్య, ఆర్‌బీ రామారావు పాల్గొన్నారు.